www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 14 జూన్ 2023

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో 8,957 మంది ఉత్తీర్ణత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గత నెలలో జరిగిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం 38 శాతం, ద్వితీయ సంవత్సరం 32 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 9,858 మంది పరీక్షలు రాయగా 3,736 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో సాధారణ విద్యార్థులు 8,397 మంది పరీక్షలు రాయగా 2,989 మంది ఉత్తీర్ణత సాధించారు. వృత్తి విద్యా విభాగంలో 1461 మంది పరీక్ష రాయగా 747 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం మొత్తం 11,400 మంది పరీక్షలు రాయగా 3,701 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో సాధారణ విద్యార్థులు 9,312 మంది పరీక్షలు రాయగా 2,928 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే వృత్తి విద్యా విభాగంలో 2,088 మంది పరీక్షలు రాయగా 773 మంది ఉత్తీర్ణత సాధించారు.

ప్రజలపై విద్యుత్ ఛార్జీల మోత

వినియోగపు, కస్టమర్, ట్రూ అప్, ఇంధనపు ఛార్జీల పేరుతో బాదుడు

అదనపు ఛార్జీల కింద ప్రతి బిల్లుపై రూ.230పైనే

లబోదిబోమంటున్న వినియోగదారులు

లో ఓల్టేజీ, విద్యుత్ కోతలతో జనం నరకయాతన

ప్రభుత్వ తీరుపై ప్రజలు ఆగ్రహం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరుకు చెందిన వరలక్ష్మి కుటుంబం అద్దె ఇంటిలో ఉంటుంది. సాధారణంగా వేసవిలో కరెంటు బిల్లు ఎక్కువ రావడం సహజం. కానీ వాడిన విద్యుత్ కాకుండా బిల్లులో డిమాండ్‌ఛార్జి, కస్టమర్ ఛార్జి, ఇడి, ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ రూపంలో అదనపు ఛార్జీల కింద రూ.252 వేయడంతో ఆమె 'షాక్'కు గురయ్యారు. ఎవరికి చెప్పాలో, ఏంచేయాలో తెలీక లబోదిబోమంటుంది. ఈ విధంగా విద్యుత్ బిల్లులు వస్తే తాము ఎలా కట్టాలంటూ ఆ కుటుంబం గగ్గోలు పెడుతోంది.

జువ్వలపాలేనికి చెందిన శ్రీనివాస్‌కు ఏప్రిల్ నెలలో విద్యుత్ బిల్లు రూ.784 వచ్చింది. మే నెల బిల్లు రూ.మూడు వేలకు పైగా వచ్చింది. ఇందులో అదనపు ఛార్జీల పేరిట రూ.233 వరకూ వడ్డించారు. విద్యుత్ ఛార్జీల పెరుగుదల, అదనపు ఛార్జీల వడ్డనతో తనకు ఇంత పెద్దమొత్తంలో బిల్లు వచ్చిందంటూ ఆ కుటుంబం లబోదిబోమంటుంది.

పైన పేర్కొన్న వరలక్ష్మి, శ్రీనివాస్ కుటుంబాలే కాదు.. జిల్లాలో ఏ ఒక్క కుటుంబాన్ని కదిపినా విద్యుత్ బిల్లులపై లబోదిబోమంటున్న పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నడూ ఈ విధంగా బిల్లులు రాలేదని, బిల్లులు ఎలా చెల్లించాలో అర్ధంకావడం లేదంటూ అంతా ఘొల్లుమంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పది లక్షలకుపైగా గృహవినియోగ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో మూడొంతల కనెక్షన్లు పేద, మధ్య తరగతి ప్రజానీకానివే. వైసిపి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ ఛార్జీల పెంపుతో పాటు, ట్రూ అప్ ఛార్జీల పేరుతో అదనపు భారం మోపుతోంది. మే నెల విద్యుత్ బిల్లులు చూసి వినియోగదారులు 'షాక్' అవుతున్నారు. ప్రతి విద్యుత్ బిల్లుపైన అదనపు ఛార్జీ కింద రూ.230 నుంచి రూ.250 వరకూ ఉన్నాయి. ఇందులో విద్యుత్ వినియోగపు ఛార్జీలు, కస్టమర్ ఛార్జి, విద్యుత్ సుంకం, ఇందన ఛార్జీల పేరుతో భారాలు మోపారు. వేసవికాలంలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండటం సర్వసాధారణం. ఈ ఏడాది ఎండలకు జనాల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఫ్యాన్ ఆగితే ఉండలేని పరిస్థితి నెలకొంది. సాధారణ రోజుల కంటే బిల్లులు కొంచెం ఎక్కువగా వస్తాయని వినియోదారులు భావించారు. అదనపు ఛార్జీలతో విద్యుత్ బిల్లులు మోతమోగించారు. దీంతో గ్రామాల్లోగానీ, పట్టణాల్లోగానీ ఏ ఇద్దరు కలిసిన విద్యుత్ బిల్లుల గురించే మాట్లాడుకుంటున్నారు. బిల్లులు కట్టలేక సామాన్య ప్రజానీకం విలవిలాడుతోంది. ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో హడావుడి చేస్తూ ప్రజలపై భారాలు మోపుతుందన్న చర్చ జనాల్లో నడుస్తోంది.

విద్యుత్ కోతలు.. లో ఓల్టేజీ సమస్య

విద్యుత్ ఛార్జీల పెంపు, అదనపు ఛార్జీల పేరుతో వినియోగదారులపై విరుచుకుపడిన విద్యుత్ శాఖ ప్రజలకు నాణ్యమైన కరెంటు సరఫరా చేయడం లేదు. లో ఓల్టేజీ పేరుతో జిల్లా ప్రజానీకం ప్రతిరోజు నరకం అనుభవిస్తున్నారు. దీనికి తోడు కరెంటు కోతలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉంది. ముఖ్యంగా పేదలు, మధ్యతరగతి ప్రజలు ఉన్న ప్రాంతంలో లో ఓల్టేజీ సమస్య మరింత దారుణంగా తయారైంది. దీంతో ఫ్యాన్లు తిరగక, లైట్లు వెలగక జనం పడుతున్న ఇబ్బందులు వర్ణాతీతంగామారాయి. కరెంటు ఉన్నా లేనట్టే అన్నట్లు పరిస్థితి తయారైంది. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన కరెంటు సరఫరా చేయాల్సిన విద్యుత్‌శాఖ పెద్దగా పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాణ్యమైన కరెంటు సరఫరా చేయకపోగా, విద్యుత్ బిల్లుల పేరిట భారాలు మోపడంపై జనం మండిపడుతున్నారు.

ఏజెన్సీ సహజ వనరులపై పూర్తి హక్కు ఆదివాసీలదే

ప్రజాశక్తి - కుక్కునూరు

ఏజెన్సీ ప్రాంతంలో లభ్యమయ్యే సహజవనరులు, ఖనిజాలపై పూర్తి హక్కు ఆదివాసీలదే అని ఆదివాసీ జెఎసి నాయకులు ధర్మల రమేష్ అన్నారు. మండల పరిధిలోని రుద్రంకోట గోదావరి ఇసుక ర్యాంపు నుండి ఇసుకను తరలిస్తుండటంతో ర్యాంపునకు సంబంధించిన అనుమతి పత్రాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం జెఎసి ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిని అందించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు ధర్మల రమేష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఆదివాసీలకు ఐదో షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక అధికారాలు, హక్కులు కల్పించబడ్డాయన్నారు. ప్రభుత్వాలు ఆదివాసీలకు కల్పించబడిన హక్కులను, చట్టాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఖనిజాలు, సహజ వనరులపై పూర్తి హక్కు ఆదివాసీలదేనన్నారు.

ఆదివాసీ హక్కుల జోలికొస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతం నుండి అక్రమంగా ఇసుక, మట్టి తోలకాలు యథేచ్ఛగా జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. రుద్రంకోటలో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపునకు సంబంధించిన అనుమతిపత్రాలు ఇవ్వాలని, సరైన అనుమతి పత్రాలు లేకపోతే తోలకాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు సోడే సీతారామయ్య, కారం బొజ్జి, బంధం ప్రసాద్, పోట్ల మోహన్ రావుదొర, పిట్టా ప్రసాద్, జి.రమేష్, డి.నాగేంద్రరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీల వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్ సౌకర్యాలు అమలు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం పి.హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.భారతి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. సిఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారంగా తెలంగాణ కన్నా అదనంగా వేతనం పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. అంగన్వాడీలపై భారం తగ్గించాలని కోరారు. రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్ ఇఎస్ఐ గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వ తేదీన జిల్లాలో ప్రాజెక్ట్ ఆఫీసుల వద్ద, జూలై పదో తేదీన కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కె.విజయలక్ష్మి, బిజెఎన్.కుమారి, పి.సరోజని, ఆదిలక్ష్మి, పుష్ప, విమల, భవాని, మాణిక్యం, సత్యవేణి పాల్గొన్నారు.

అరుణాచల యాత్రకు ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

గురు పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం జంగారెడ్డిగూడెం డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామని ఎపిఎస్ ఆర్‌టిసి డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. మంగళవారం ఈ మేరకు డిపో మేనేజర్ గంగాధర్ వివరాలు వెల్లడించారు. జులై ఒకటో తేదీ రాత్రి 7.00 గంటలకు జంగారెడ్డిగూడెం డిపో నుంచి బస్సు బయలుదేరి రెండో తేదీ తెల్లవారుజామున శ్రీకాళహస్తి చేరుకుంటుందని తెలిపారు. అక్కడ నుంచి కాణిపాకం, శ్రీపురం క్షేత్రాల మీదుగా రాత్రికి అరుణాచలం చేరుతుందని తెలిపారు. మూడో తేదీ గురుపౌర్ణమి రోజున దర్శన అనంతరం అరుణాచలంలో బయలుదేరి నాలుగో తేదీ ఉదయం జంగారెడ్డిగూడెం చేరుకుంటుందని తెలిపారు. టిక్కెట్ ధర ఒకరికి రూ.2800 అని తెలిపారు. ఈ అవకాశాన్ని యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9959225489, 9491019105, 7382907490 సంప్రదించాలని డిపో మేనేజర్ గంగాధర్ సూచించారు.

విజిలెన్స్ అధికారుల మెరుపుదాడి

రూ.9 లక్షలు జరిమానా

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న గృహ వినియోగదారులు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఇఇ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు 49 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 1468 గృహ సర్వీసులు, 119 వాణిజ్య సముదాయాలు, 303 ఆక్వా సర్వీసులను తనిఖీ చేశారు. వాటిలో 178 సర్వీసులకు ఆదనపు లోడు 342 కెడబ్ల్యు మొత్తనికి రూ.తొమ్మిది లక్షల జరిమాన విధించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఇఇ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజికి నేరమని, విద్యుత్ చౌర్యానికి పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - కలిదిండి

ఉపాధి కూలీల బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళరావు అన్నారు. మండలంలోని లోడిదలంకలో ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఉపాధి పనుల సమస్యలతో పాటు తాగునీరు, రోడ్డు సమస్యలను ఉపాధి కూలీలు ఏకరువు పెట్టారు. గత సంవత్సర వేతన బకాయిలు చెల్లించలేదని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. గ్రామంలోని పది ఎకరాల మంచినీటి చెరువులోని నీరు పసర్లుగా మారి దుర్వాసన వస్తున్నాయన్నారు. తాగునీటితో పాటు వాడకం నీటిని కలిదిండి వెళ్లి 30 లీటర్ల టిన్ను రూ.60కు కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోయారు. లోడిదలంక గ్రామానికి ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని మహంకాళరావు డిమాండ్ చేశారు. లోడిదలంక నుంచి పడమటిపాలెం వరకు రోడ్డు గుంతలతో అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు కొచ్చర్ల రమేష్, కంచర్ల జాను, బంద్రపల్లి ధర్మారావు, జానపాముల రామారావు, బొల్లా ప్రసాద్, పర్వతనేని ప్రభాకరరావు, ఎ.భోగేశ్వరరావు, చిట్టూరి రత్నకుమారి, మేకా సత్యన్నారాయణ, బొడ్డేటి వెంకటరమణ పాల్గొన్నారు.

రక్తదానంలో ఆదర్శం కమల్‌కుమార్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆపద, అత్యవసర సమయాల్లో రక్తదానంతో ఎంతో మంది సహాయ పడొచ్చనే ముందుచూపుతో ఉంగుటూరు మండలం కైకరానికి చెందిన ఉపాధ్యాయుడు, యుటిఎఫ్ జిల్లా నాయకుడు కూన కమల్‌కుమార్ ఇప్పటివరకు 36 సార్లు రక్తదానం చేసి ఔరా అనిపించి ఆదర్శనీయంగా నిలిచారు. ప్రస్తుతం ఆయన రాచూరు ఆల్తిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిని పని చేస్తున్నారు. ఈ నెల 15న ప్రపంచ రక్తదానం దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 36వ సారి రక్తదానం చేసి తన ఉదారతను చాటుకున్న కమల్‌ను పలువురు అభినందించారు. రక్తదానంపై అపోహలను నివృత్తి చేయడం, రక్తదానం చేసేవారిని ప్రేరేపించడం ధ్యేయంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.



రక్తదానం చేస్తున్న కమల్‌కుమార్

వడదెబ్బకు వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - కుక్కునూరు

వడదెబ్బకు వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక సినిమా హాల్ సెంటర్‌కు చెందిన షేక్ జానీమియా (68) నాలుగు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో స్థానిక ఆసుపత్రి వైద్యునికి చూపించినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతునికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

ఇద్దరు వాలంటీర్లు సస్పెన్షన్

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని సోమవరం గ్రామానికి చెందిన ఇద్దరు వాలంటీర్లను సస్పెండ్ చేసినట్లు ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం గ్రామంలో ఇటీవల కలవల శ్రీను ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన కేసులో ఎఫ్ఐఆర్‌లో ఇద్దరి వాలంటీర్ల పేర్లు నమోదు కావడంతో రిమాండ్‌లో ఉన్న చెన్ను చైతన్య, కుందేటి శ్రీకాంత్‌లను ఎంపిడిఒ విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

కుంగ్ ఫూతో ఆత్మ విశ్వాసం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కుంగ్ ఫు విద్యతో శారీరిక వ్యాయామంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని సినీ హీరో సుమన్ అన్నారు. ఇటీవల జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్న అనన్య చిత్ర షూటింగ్ నిమిత్తం వచ్చిన సినీనటులు సుమన్‌ని జంగారెడ్డిగూడెం కుంగ్‌ఫు, యోగా విద్యార్థులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సినీ హీరో సుమన్ మాట్లాడుతూ కుంగ్ ఫు, కరాటే విద్యార్థులను అభినందించారు. కుంగ్ ఫు నేర్చుకోవడం వల్ల ఆరోగ్యం, ఆత్మరక్షణకు తోడ్పడుతుందని తెలిపారు. ముఖ్యంగా ఆడ పిల్లలకు కుంగ్ ఫు నేర్పడం వల్ల ఆత్మరక్షణకు, ఆత్మ విశ్వాసానికి దోహదపడుతుందన్నారు.

డిమాండ్ల పరిష్కారంపై హర్షం

ఏలూరు అర్బన్ :ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యంలో 92 రోజులు ఉద్యమం చేయడం వల్ల ఉద్యోగుల న్యాయమైన కొన్ని డిమాండ్లు సిఎం జగన్ పరిష్కరించడం హర్షణీయమని ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి అభినందనలు తెలియజేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన కాంట్రాక్టు ఉద్యోగులను కూడా దశల వారిగా రెగ్యులర్ చేయాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

చించినాడలో మళ్లీ ఉద్రిక్తత

పెరుగులంక భూముల ఉద్యమకారులపై కర్కశత్వం

భూముల పరిశీలనకు వెళ్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం ఎంఎల్ఎ నిమ్మలతో సహా 40 మంది అరెస్ట్

బలవంతంగా వ్యాన్‌లోకి ఈడ్చుకెళ్లి వివిధ స్టేషన్లకు తరలింపు

పోలీసుల తీరుతో పలువురికి గాయాలు

ఆస్పత్రికి తరలింపు

ప్రభుత్వంపై దళితుల తీవ్ర ఆగ్రహం

ప్రజాశక్తి - యలమంచిలి

చించినాడ మరోసారి రణరంగంగా మారింది. అఖిలపక్షాల ఆధ్వర్యంలో దళిత బలహీనవర్గాల సంఘీభావ బహిరంగ సభకు పిలుపునివ్వడంతో గ్రామస్తులతో పాటు వివిధ పార్టీల, ప్రజాసంఘాల నేతలు మంగళవారం భారీగా తరలివచ్చారు. బహిరంగసభ అనంతరం అఖిలపక్షం ఆధ్వర్యంలో పెరుగులంక భూములను పరిశీలించేందుకు బయలుదేరిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావును, పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్‌తో సహా సుమారు 40 మందిని పోలీసులు అరెస్టు చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నేతలను తరలిస్తున్న పోలీసుల వాహనాలకు ఉద్యమకారులు అడ్డుగా నిలబడి నిరసన తెలిపారు. అయినప్పటికీ పోలీసులు వారిని బలవంతంగా వారిని పక్కకు నెట్టి ఓ ప్రయివేటు స్కూల్‌బస్సులో స్టేషన్లకు తీసుకెళ్లారు. తొలుత వారిని ఏ స్టేషన్‌కు తరలిస్తున్నారో కూడా తెలియకుండా వ్యాన్‌లో ఎక్కించి తొలుత ఆచంట తీసుకెళ్లారు. ఆచంట కచేరీ సెంటర్‌లో సిపిఎం, టిడిపి నాయకులు వ్యాన్‌ను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. అక్కడకూడా పోలీసులు కర్కశంగ వ్యవహరించి వారికి పక్కకు నెట్టుకుంటూ పెనుమంట్ర మండలం మార్టేరు మీదుగా తాడేపల్లిగూడెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులు ఆందోళనకారుల పట్ల విచక్షణారహితంగా వ్యవహరించారు. దాడులకు సైతం పాల్పడుతూ బలవంతంగా ఈడ్చేశారు. ఈ క్రమంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ తలకు బలమైన గాయం కావడంతో స్పృహ కోల్పోయారు. వెంటనే ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అరెస్టయినవారిలో నాయకులు కౌరు పెద్దిరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, బాసిన శ్యామల, కానేటి ప్రియాంక, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజుతో సహా సుమారు 40 మందిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు.

అక్రమ కేసులు.. దౌర్జన్యాలు ప్రభుత్వానికి తగవు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం : చించినాడలో మట్టి మాఫియాకు కొమ్ముకాస్తూ, దళితుల భూముల కోసం దౌర్జన్యం చేయడం, కొట్టడం, కేసులు పెట్టడం దారుణమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. యలమంచిలి మండలం చించినాడలో అరెస్టు చేసిన ఆయన్ను తాడేపల్లిగూడెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకపక్క సిఎం జగన్.. తమది దళిత ప్రభుత్వమని చెబుతున్నారని, కానీ ఆచరణలో వారిపై దాడులు చేయడం అన్యాయమన్నారు. ఆయన ఎవరి పక్షమో తేల్చాలన్నారు. అధికారులకు కొమ్ముకాస్తూ, దళితులపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. మఫియాలకు మద్దతుగా తమరు పనిచేస్తే ప్రభుత్వం కూడా మట్టికొట్టుకుపోతుందన్నారు. కేసులు పెట్టాల్సిన వారిని వదిలేసి వారికి రక్షణగా పోలీసులను, అధికారులను పంపించడం ఎంతవరకు సమంజసమన్నారు. చించినాడ దళితులకు న్యాయం చేయకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ దళితుల మట్టిని అక్రమంగా ఎలా అమ్ముకుంటున్నారో సాక్ష్యాధారాలతో పోలీసు వారికి అప్పజెప్పినప్పటికీ నిందితులపై ఏ విధమైన కేసులూ పెట్టకుండా అమాయకులైన క్లినర్లు, డ్రైవర్లపైన కేసులు పెట్టారు కానీ అసలు కారకులను అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. దళితుల రక్షణ కోసం వచ్చిన తమను పదేపదే అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. దళిత భూముల రక్షణ కోసం ఎన్ని కేసులకైనా తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, టిడిపి నాయకులు పరిమి రవికుమార్, గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, పాతూరి రామ్‌ప్రసాద్ చౌదరి, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, టిడిపి నాయకులు పోలీసు స్టేషన్ ఎదుట పెద్దఎత్తున నినాదాలు చేశారు.

వి.శ్రీనివాసరావును అరెస్టు చేస్తున్న పోలీసులు

బలరాంను అరెస్టు చేస్తున్న పోలీసులు

మనుషులా లేక రాక్షసులా

అంతకుముందు జరిగిన అఖిలపక్ష దళిత బలహీన వర్గాల సంఘీభావలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడారు. మట్టిని తెగనమ్ముకోవడానికి ఎలాంటి దారుణాలకైనా తెగబడుతున్న వైసిపి నాయకులను చూస్తుంటే అసలు వీళ్ల మనుషులా లేక నరరూప రాక్షసులా అనే అనుమానం కలుగుతుందన్నారు. వైసిపి నాయకులు 2024లో తిరిగి అధికారంలోకి వస్తామనే నమ్మకం లేకపోవడంతో అధికారం ఉన్నన్ని రోజులు రాష్ట్రంలోని సహజవనరులన్నింటినీ దోచుకుతినడానికి పోటీ పడుతున్నారని, చించినాడ పెరుగులంక భూముల్లో మట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న దళితులపై, పేదలపై పోలీసులు చేత అమానుషంగా దాడి చేయించి తలలు పగలగొట్టి దౌర్జన్యంగా మట్టిని అమ్ముకుంటూ వైసిపి నాయకులు కోట్ల రూపాయలను దోచుకుంటున్నారని విమర్శించారు. నిబంధనలు ఉల్లంఘించి దళితుల భూముల్లో మట్టిని తరలిస్తున్న ఈ నాయకులకు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామని, అదేవిధంగా చట్టాలను కాపాడాల్సిన అధికారులు రాజకీయ నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్నారని, వీరందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. సిఎం జగన్‌ను దళితులందరూ నమ్మి ఓట్లు వస్తే ప్రస్తుతం ఆయన దళితులపై కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

ఎంఎల్ఎ నిమ్మల మాట్లాడుతూ జగనన్న కాలనీకి మట్టిని తోలుతున్నామని మోసపూరిత మాటలు చెప్పిన నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు, ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్ మట్టిని అమ్ముకుంటూ అడ్డంగా దొరికారని చిన్న చిన్న నేరాలు చేసే నేరస్థులకు పోలీసులు ముసుగు వేసి చూపిస్తారు కానీ నరసాపురం డిఎస్‌పికి దమ్ముంటే మట్టిని అమ్ముకుంటూ అడ్డంగా దొరికిన ముదునూరి ప్రసాదరాజుకు, ఎంఎల్‌సి శ్రీనివాసుకు ముసుగు వేసే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మహాసేన నేత రాజేష్, మాజీ మంత్రి కొండ్రు మురళీ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు ఫార్వర్డ్ బ్లాక్ సభ్యులు లంక కృష్ణమూర్తి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు దేవ రాజేంద్రప్రసాద్ జనసేన నాయకులు భారం చినబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, నాయకులు పాల్గొన్నారు,

సంఘీభావ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు



ప్రజాసంఘాల నేతల అరెస్టు అన్యాయం

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ గ్రామం పెరుగులంక భూముల్లో అక్రమ తవ్వకాలపై ప్రశాంతంగా జరుగుతున్న సభలో ఉన్న దళితులు, ఇతర పేదలపై లాఠీఛార్జీ చేసి, అక్రమంగా అరెస్టు చేయడాన్ని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు అండతో చేస్తున్న అక్రమ తవ్వకాలను ఆపాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మంగళవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. చించినాడ గ్రామం పెరుగులంక భూముల్లో 380 దళిత బిసి, పేద కుటుంబాలు పట్టాలు పొంది 40 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నారని, ఈ భూముల్లో అక్రమ ఇసుక తవ్వకాలు ఆపాలని దళితులు న్యాయబద్ధంగా గత కొన్నాళ్లుగా ఆందోళన చేస్తున్నారని, ఈ భూముల్లో తవ్వకాలు చేపట్టకుండా హైకోర్టు ఆదేశాలున్నప్పటికీ ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు అండతో చట్టాన్ని ధిక్కరించి తవ్వకాలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఈ అక్రమ తవ్వకాలకు పోలీసు, ప్రభుత్వ యంత్రాంగం వత్తాసు పలుకుతోందని ప్రసాదరాజు చించినాడ ప్రజలు, దళితులపై కక్షకట్టి వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇతర ప్రభుత్వ భూములున్నప్పటికీ కాంట్రాక్టర్‌కు మట్టిని అక్రమంగా కట్టబెట్టేందుకు ప్రభుత్వం పూనుకుంటుందని, దీంతో గోదావరి గట్టుకు ప్రమాదం ఉందని, వరదల్లో కట్టతెగి పొలాలపైకి నీళ్లు వస్తే అందుకు ప్రభుత్వ యంత్రాంగమే బాధ్యత వహించాలన్నారు. శాంతియుతంగా జరుగుతున్న సభలో పేదలపై పోలీసు యంత్రాంగం లాఠీఛార్జీ చేసి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, స్థానిక ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, వ్యవసాయ కార్మిక, రైతు, కార్మిక సంఘాల నాయకులు సుమారు 50 మందిని అరెస్టు చేయడం అన్యాయమన్నారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి పేదలపై, మహిళలపై దౌర్జన్యానికి పూనుకోవటం దారుణమన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, పెరుగులంక భూముల్లో అక్రమ తవ్వకాలు ఆపాలని డిమాండ్ చేశారు.

కైకలూరు : విద్యాకానుక కిట్లు అందిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

విద్యాకానుక కిట్లు అందజేత

ప్రజాశక్తి - కైకలూరు

మండలంలోని ఆటపాక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, నాయకులు గుర్రాజు, ఎంపిపి అడవి వెంకట కృష్ణమోహన్, జహీర్, సర్పంచి తలారి మణి జాన్, సర్పంచి దానం మేరీ నవరత్నకుమారి, ఎఎంసి ఛైర్మన్ దండే పుష్పలత, రవిప్రకాష్ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : మండలములోని గొల్లపల్లి శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పి.రాధికారాణి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి బొకినాల వెంకటేశ్వరమ్మ చేతులమీదుగా విద్యాకానుక కిట్లు అందించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, బూట్లు, మూడు జతల యూనిఫాం, బెల్ట్, సాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తటకలూరి రంగారావు, విద్యా కమిటీ ఛైర్మన్ పల్లగాని వెంకటేశ్వరరావు, యామర్తి ఇశ్రాయేలు, కో ఆప్షన్ మెంబర్ లెనిన్, కన్వీనర్ సోమగాని మహేశ్వరరావు, యామర్తి శ్రీనివాసరావు, రెడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ స్థలం మెరక పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

పోలీస్ స్టేషన్‌ను త్వరగా నిర్మించాలి

ప్రజాశక్తి - మండవల్లి

పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలం మెరక పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా ప్రస్తుతం ఉన్న పోలీస్ స్టేషన్ తొలగించాల్సి వస్తున్నందున నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి మండల పరిషత్ పాఠశాల వెనుక కమ్మరి కోడు భూమిలో స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంను కూడా నూతనంగా నిర్మించనున్న పోలీస్ స్టేషన్ ప్రాంతంలోనే నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. మెరక పూర్తయినందున భవన నిర్మాణాన్ని ప్రారంభించి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కైకలూరు సిఐ వైవిఎల్.నాయుడు, ఎస్ఐ రామకృష్ణ, సర్పంచి మెండ ఝాన్సీ, పార్టీ మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు చేయబోయిన వీర్రాజు, పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ల యాదవ్, మెండ సురేష్, కాంట్రాక్టర్ కొల్లా సాయి పాల్గొన్నారు.

స్టేడియం అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణ పరిధిలోని గురుకుల పాఠశాల సమీపంలో ఉన్న తొమ్మిది ఎకరాల గ్రౌండ్‌ను క్రికెట్ గ్రౌండ్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. రూ.1.40 కోట్ల వ్యయంతో గ్రౌండ్ లెవెల్ చేయడం, ఫెన్సింగ్ వేయడం, పిచ్ తయారు చేయటం, గ్రీన్ గ్రాస్ పెంచడం, అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయడం కోసం త్వరలోనే టెండర్లు పిలిచి పనులు చేపడతామని ఎంఎల్ఎ తెలిపారు.

నేరాలు - ఘోరాలు

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పోలవరం

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ప్రగడపల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగడపల్లి గ్రామానికి చెందిన కుప్పాల దుర్గాప్రసాద్ (30) ప్రగడపల్లి గ్రామం నుంచి సోమవారం రాత్రి బైక్‌పై పోలవరం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొవ్వాడ కాలువ బ్రిడ్జి సమీపంలో ప్రమాదశాత్తు మలుపు వద్దకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పడంతో దుర్గాప్రసాద్ కింద పడి అక్కడే మైలురాయిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన దుర్గాప్రసాద్‌ను తెల్లవారుజామున అటువైపుగా వెళ్తున్న కొందరు చూసి 108 వాహనానికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 వాహన సిబ్బంది పరీక్షించి దుర్గాప్రసాద్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో..

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మద్యం మత్తులో యువకుడు కాళ్లు, చేతులు కోసుకున్నాడు. పట్టణ పరిధిలోని కొత్తపేటకు చెందిన రాజమహేంద్రవరపు నాని అనే వ్యక్తి సాయంత్రం చేయాలని అతని తల్లిదండ్రులు అడిగారు. దీంతో నాని మద్యం తాగి ఆ మత్తులో బ్లేడు, చాకులతో కాళ్లు చేతులు కోసుకున్నాడని తల్లిదండ్రులు తెలిపారు.

వివాహితపై లైంగిక వేధింపులు
యువకుడు అరెస్టు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని సూరప్పగూడెం గ్రామంలో వివాహితను లైంగిక వేధింపులకు గురి చేశాడన్న ఆరోపణలతో యువకునిపై కేసు నమోదైంది. ఫిర్యాదుపై భీమడోలు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. భీమడోలు ఎస్ఐ చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సూరప్పగూడెం గ్రామానికి చెందిన యువకుడు సోడగిరి అజయ్ తనను లైగింక వేధింపులకు గురి చేశాడని అదే గ్రామానికి చెందిన వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన భీమడోలు ఎస్ఐ విచారణ అనంతరం నిందితుడిని సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం నిందితుడిని భీమడోలు కోర్టులో హాజరు పరచగా కోర్టు వారు నిందితునికి రిమాండ్ విధించారు. కేసును భీమడోలు ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పేరంపేటలో సంభవించిన అగ్ని ప్రమాదంలో కొట్రా నరసయ్యకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. నరసయ్య కుటుంబం గ్రామ శివారులోని పొలంలో తాటాకిల్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. మంగళవారం పక్కనే రైతులు పొలాల్లో తుక్కు తగులపెడుతుండగా నిప్పు రవ్వలు ఎగసిపడి నరసయ్య పాకపై పడటంతో మంటలు చెలరేగాయి. తాటాకింటిలో ఉన్న గ్యాస్ బండ పేలడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి ఇల్లు దగ్ధమైంది. స్థానికులు మంటలను అదుపు చేయడంలో సహకరించారు. ఇంటిలో ఉన్న నగదు, దుస్తులు, గృహోపకరణాలు కాలి బూడిదైనట్లు నరసయ్య తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రహదారిపై గోతులు.. ప్రయాణికుల అవస్థలు

ప్రమాదాల బారిన వాహనదారులు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - మండవల్లి

జాతీయ రహదారి పామర్రు 165పై మండవల్లి వద్ద భారీ గోతులు ఏర్పడ్డాయి. గోతుల్లో నుంచి రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆ ప్రాంతంలో ఉన్న డ్రెయినేజీ పొంగి మురుగునీరు గోతుల్లోకి చేరడంతో గొయ్యి ఎంత లోతు ఉందో తెలియక వాహనాలు అమాంతం గోతిలో పడిపోతున్నాయి. రాత్రి వేళల్లో గోతులు కనపడక ద్విచక్రవాహనదారులు గోతుల్లోని మురుగు నీటిలో పడిపోతున్నారు. గత ఆరు నెలల నుంచి ఈ ప్రాంతంలో ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతూనే ఉన్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఆ ప్రాంతంలో గొయ్యి ఉందని తెలిసేవిధంగా సూచికబోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి కైకలూరు సందు వద్ద ప్రధాన సెంటర్‌లో జాతీయ రహదారిపై ఏర్పడిన గొంతులను పూర్తిస్థాయిలో పూడిపించాలని వాహనదారులు వాహనదారులు కోరుతున్నారు. దీనిపై ఎన్‌హెచ్ ఎఇ శరత్‌ని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

గోతులమయంగా ఉన్న రోడ్డు

సచివాలయాల్లో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ఎంపిడిఒ జి.శ్రీను బాధ్యతలు చేపట్టిన తర్వాత మండలంలోని పట్టిసీమ, కొత్త పట్టిసీమ గ్రామ సచివాలయాలను మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి యు.రాజారావు, పంచాయతీ సెక్రటరీ విజయకుమారి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి - టి.నరసాపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జిల్లా వికలాంగుల పునరవాస కేంద్రం ఆధ్వర్యంలో వికలాంగుల గుర్తింపు శిబిరం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగులకు అవసరమైన పరికరాలను అందించనున్నట్లు జిల్లా వికలాంగుల పునరవాస కేంద్రం కో-ఆర్డినేటర్ డి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మంగాకుమారి మాట్లాడుతూ వికలాంగులు వారికి అవసరమైన పరికరాలను ఉపయోగించుకుని జీవితంలో ముందుకు వెళ్లాలన్నారు. వికలాంగులకు ఉపాధి హామీ పనిలో భాగంగా వేతనాల సవరణ ఉంటుందని తెలిపారు. వికలాంగుల జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూవికలాంగుల పునరవాస కేంద్రం ద్వారా ఆడియోలజీ, సైకాలజీ, ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని, వికలాంగులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ గుర్తింపు శిబిరం ద్వారా 36 మంది వికలాంగులను పరీక్షించి వివిధ పరికరాలకు గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ శ్రీనివాస్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులు తనిఖీ చేస్తున్న అధికారులు

స్కూల్ బస్సులు తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలో రవాణా శాఖ అధికారులు పాఠశాలల బస్సులను మంగళవారం తనిఖీ చేశారు. ప్రాంతీయ రవాణా అధికారి శ్రీహరి తనిఖీ చేసి మాట్లాడుతూ జిల్లా రవాణా శాఖ రవాణా కమిషనర్ మనీష్ కుమార్‌సిన్హా ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు స్కూల్, కాలేజీ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని స్కూల్, కాలేజీ బస్సులపై ఐదు కేసులు, పర్మిట్ లేని స్కూల్, కాలేజీ బస్సులపై రెండు కేసులు ఇతర వాహన రికార్డు లేని బస్సులపై నాలుగు కేసులు నమోదు చేశామన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ప్రాంతీయ రవాణా అధికారి కె.శ్రీహరి, సహాయ మోటార్ తనిఖీ అధికారి టివి.కృష్ణవేణి, జి.స్వామి పాల్గొన్నారు.

మండవల్లిలో చెత్తకుండీలు ఏర్పాటు

ప్రజాశక్తి - మండవల్లి

స్వచ్ఛ గ్రామంగా మండవల్లిని తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరు సహకరించాలని ఇఒపిఆర్‌డి ఆనందబాబు కోరారు. మండల కేంద్రమైన మండవల్లి పంచాయతీ ఆధ్వర్యంలో ఆయన మంగళవారం చెత్తకుండీలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకూడదనే ఉద్దేశంతో కుండీలను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. గ్రామస్తులు చెత్తకుండీలను చెత్త బండిని సద్వినియోగం చేసుకొని చెత్త రహిత గ్రామంగా మండవల్లిని తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మెండ ఝాన్సీ, కార్యదర్శి తోట శ్రీనివాసరావు, మెండ సురేష్‌బాబు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా నియమాలపై అవగాహన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విద్యుత్ భద్రత నియమాలపై సిబ్బంది అవగాహన పొందాలని విద్యుత్ శాఖ జంగారెడ్డిగూడెం డివిజన్ డిఇ కెఎం అంబేద్కర్ సూచించారు. స్థానిక ఆలపాటి గంగాభవాని కళ్యాణ మండపంలో విద్యుత్ శాఖ సిబ్బందికి విద్యుత్ భద్రతా నియమాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇ కెఎం.అంబేద్కర్ మాట్లాడుతూ ఇటీవల జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో వేసవిలో నెలకొన్న విద్యుత్ అంతరాయాలపై సమీక్షించారు. లైన్‌మేన్, లైన్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు బాధ్యత రాహిత్యంగా ఉండటంవల్ల అవగాహన లోపంతో జూనియర్ లైన్‌మేన్లు పొరపాట్లు చేస్తున్నారన్నారు. దీనివల్ల ఎఫ్‌డిఆర్‌లు మరమ్మతుకు గురవుతున్నాయన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి నాణ్యమైన సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఎడి ఎ సుబ్బారావు, జీలుగుమిల్లి ఎడిఎ టి.వెంకటేశ్వరరావు, ఎఇలు ఎం.మోజెష్, ఎస్.శ్రీనివాస్, డి.గోలినాయక్ పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు గ్రామం కొత్త ఉంగుటూరులో అక్రమ లేఅవుట్‌పై వచ్చిన స్పందన ఫిర్యాదు పరిష్కారంలో భాగంగా సదరు లేఅవుట్‌లో నిబంధనలు పాటించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక ఫ్లెక్సీలను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కాకర్ల వెంకట గిరిధర్, వార్డ్ మెంబర్ వెలగల కృష్ణవేణి వెంకన్న, సచివాలయ సిబ్బంది, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి


శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన కమిటీ ఛైర్మన్ నల్లూరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖ గ్రంథాలయం రూ.55 లక్షలతో నిర్మించినప్పటికీ పాఠకులు చదవడానికి పుస్తకాలు లేకపోవడం బాధాకరమన్నారు. గ్రంథాలయంలో ఫర్నీచర్‌తో పాటు అన్ని రకాల పుస్తకాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. దాతల సహకారంతో ఉచిత కంప్యూటర్ కోర్సులు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ దేవరపల్లి ముత్తయ్య, లైబ్రేరియన్ కిషోర్, కన్నం సర్వేశ్వరరావు, పసుమర్తి రాము, మండం సత్యనారాయణమూర్తి, మాదంశెట్టి మల్లికార్జునరావు, పురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్తుకు పునాది.. అంగన్‌వాడీ విద్య

ప్రజాశక్తి - భీమడోలు

ఐదేళ్ల లోపు చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసే అంగన్‌వాడీ విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ సిడిపిఒ కె.విజయలక్ష్మి కోరారు. ప్రాజెక్టు పరిధిలోని గుండుగొలను గ్రామపంచాయతీలో వివిధ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో జనభాగీదారి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త బి.రాజమణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిపిఒ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ అంగన్‌వాడీ విద్య ఆటపాటలతో కూడిన విద్య అన్నారు. బాలల భవితకు భాగస్వామ్యం వహించే కార్యక్రమంలో భాగంగా జనభాగీదారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత బి.రాజామణికి చెందిన అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ, విద్యాబోధన ఇతర సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాటుచేసిన వివిధ ఉపకరణాలతో కూడిన ప్రదర్శనశాలను తిలకించారు. కార్యక్రమానికి అతిథిగా స్వచ్ఛంద సంస్థ ప్రథమ్ సహ సమన్వయకర్త పి.శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం గుండుగొలను పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్‌కు చెందిన గుండుగొలను పర్యవేక్షకులు కె.కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.రాజమణి, డి,అన్నమ్మ, జె.పద్మకుమారి, ఎం.విజయలక్ష్మి, కెబటి సుందరి, బి.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.


ఉంగుటూరులో...

ఉంగుటూరు :మండలంలోని చేబ్రోలులో అంగన్‌వాడీ కేంద్రంలో బాలల భవితకు భాగస్వామ్యం - జనభాగీదారీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ తెల్ల శారదామని ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సర్పంచి రాందే లక్ష్మీసునీత, తల్లులు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పథకాలు లబ్ధి వివరాలపై అవగాహన కల్పించారు. చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఇంటింటా తిరిగి ప్రచారం చేపట్టారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్చాలి

ముసునూరు : మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్చాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి అన్నారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెం సెంటర్ పరిధిలో అంగన్‌వాడీ ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్చాలని మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

అంబర్‌పేటలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'


అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు నియోజకవర్గంలో ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారంతో 168వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ వాసుబాబు మంగళవారం అంబర్‌పేట గ్రామంలో కార్యక్రమాన్ని కొనసాగించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అంబేద్కర్, వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని గడపగడపకూ వెళ్లి వారి కుటుంబాలకు కేటాయించిన లబ్ధి ఏ మేరకు చేరిందనే విషయమై ఆరా తీశారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సొసైటీ అధ్యక్షులు రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు షేక్ ఆజాం, రామకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రజాశక్తి - మండవల్లి

మొక్కలను నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సుధామ ఫౌండేషన్ అధినేత శాస్త్రవేత్త సుధాబత్తుల విజయ్‌కుమార్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మొక్కలను నాటి వాటిని సంరక్షించే విధంగా గార్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఉద్యమంలా నిర్వహించాలన్నారు. మొక్కలు లేకపోతే మానవ మనవడే ప్రశ్నార్ధకమవుతుందన్నారు. సుధామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీడను ఇచ్చే మొక్కలతోపాటు వైద్యానికి ఉపయోగపడే కతంభం, వేప, సింధూరం, పచ్చతరాయి మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకున్నామని తెలిపారు. అంతేకాకుండా మండవల్లి, లింగాల, కానుకొల్లు, ఇంగిలంపాకలంక, లోకుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో విద్యార్థులకు సుధామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణంపై అవగాహన పెంచే విధంగా వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పెద్ద పెద్ద చెట్లు తొలగించడంతో ఎండవేడిమికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, విస్తరణ అనంతరం రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ప్రజాస్వామి పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, మండల శాఖ బాధ్యులు అప్పారావు పాల్గొన్నారు.

రైల్వే స్థలాలను ఖాళీ చేయకుంటే చర్యలు

రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్

ప్రజాశక్తి - మండవల్లి

ఆక్రమించుకున్న రైల్వే స్థలాలను వెంటనే ఖాళీ చేయాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ రామాంజనేయులు స్పష్టం చేశారు. మండవల్లిలో రైల్వే స్థలాలను ఆక్రమించుకుని ఏర్పాటు చేసుకున్న ప్రయివేట్ నివాసాలను రైల్వే సిఐ ఎస్‌కె.దస్తగిరి ఆధ్వర్యంలో మంగళవారం జెసిబితో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండవల్లిలో అనేకమంది రైల్వే స్థలాలను ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకున్నారన్నారు. రైల్వే స్థలాన్ని ఆక్రమించకూడదని నిర్మాణాలను తొలగించాలని ఆక్రమణదారులకు ఫారం ఎ బి ద్వారా నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఆక్రమణదారులు స్వయంగా తొలగించుకునేవిధంగా వారికి కొంత సమయాన్ని కూడా కేటాయించినట్లు తెలిపారు. 90 శాతం మంది స్వచ్ఛందంగా నివాసాలను తొలగించారని, పది శాతం తొలగించలేదని చెప్పారు. దీంతో రైల్వే స్థలాన్ని ఆక్రమించుకుని ఏర్పాటు చేసుకున్న నివాసాలను సిబ్బందితో తొలగించే కార్యక్రమం చేపట్టామన్నారు. రైల్వే స్థలాన్ని ఆక్రమించుకుని నివాసం ఏర్పాటు చేసుకుంటే ఎప్పటికైనా కొట్టివేస్తామన్నారు. ఎవరికి వారే స్వచ్ఛందంగా తొలగించుకుంటే వారి ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ఉంటుందన్నారు. ఆక్రమణ తొలగించే క్రమంలో ఆక్రమణదారులకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వడం జరగదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇప్పటికైనా రైల్వే స్థలాలను ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేసుకొని నష్టపోకుండా ముందుగానే రైల్వే స్థలాలను ఆక్రమించకుండా జాగ్రత్త పడాలన్నారు. ఆక్రమణల తొలగింపులో క్రమంలో ఇబ్బందులు తలెత్తకుండా పెద్ద ఎత్తున రైల్వే పోలీస్ సిబ్బంది, మండవల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది మోహరించారు.

రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఉమ్మడి ఖమ్మం జిల్లా మధిర, ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు, విసన్నపేట, ఏలూరు జిల్లా నూజివీడు మీదుగా కృష్ణాజిల్లా గుడివాడ వరకు రైల్వేలైన్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతూ నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు మంగళవారం వినతిపత్రం బిజెపి నూజివీడు మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాస్ కుమార్ తెలిపారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి లేఖ పూర్వకంగా విజ్ఞప్తి చేయాలని కోరామన్నారు. కొత్త రైల్వేలైన్ ఏర్పాట్లకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉన్న దృష్ట్యా అన్ని పార్టీల నాయకుల సహకారం తీసుకొని ఈ విషయంలో ముందుకు వెళ్లాలన్నారు. బొగ్గు, మామిడి, పౌల్ట్రీ, మొక్కజొన్న తదితర ఉత్పత్తులు ఎగుమతి చేసేందుకు రైల్వే లైన్ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఎండలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో బిపి, షుగర్ ఉన్నవారు, వయోవృద్ధులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర సింగ్ తెలిపారు. మంగళవారం నూజివీడులో ఆయన మాట్లాడుతూ ఉదయం పది గంటల లోపు సాయంత్రం నాలుగు గంటల తరువాత పనులు చేసుకోవాలన్నారు. ప్రజలు ఎండలో తిరగవద్దని చెప్పారు. ఏదైనా వైద్య సహాయం కావాలంటే ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని ఆయన కోరారు.

వీధి కుక్కల బెడదతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణ పరిసరాల ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు స్పందన కార్యక్రమంలో మొరపెట్టుకున్నా అధికారులు తగు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధికుక్కలు దాడి చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జగన్ అవినీతిపరుడు : టిడిపి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

దోచుకోవడంలో సిఎం జగన్‌ను మించిన ఘనుడు మరొకరు లేరని టిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేకసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారన్నారు. టిడిపి హయాంలో లోటు విద్యుత్ నుంచి మిగులు తీసుకొచ్చారు. ప్రస్తుతం పవర్ హాలిడే తీసుకొచ్చిన ఘనుడు జగన్ అని ఎద్దేవా చేశారు.

వికలాంగునికి సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

మానవసేవే మాధవసేవ అజీమ్ ఛారిటి ఫౌండర్ అజాద్ అన్నారు. పట్టణానికి చెందిన విభిన్న ప్రతిభవంతుడు షేక్ ఖాసింకు జంగారెడ్డిగూడెం సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు జయవరవు శేఖర్ మంగళవారం ట్రై సైకిల్ అందించారు. చింతలపూడి పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీనరసింహ జ్యువెలరీ షాపు అధినేత నడిపల్లి విద్యధరరావు రూ.మూడు వేల విలువైన ఎల్రక్టానిక్ రైస్ కుక్కర్, బియ్యం అందించారు.

జూనియర్ కళాశాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరులో జూనియర్ కళాశాలలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు చేరాలని జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ.సునీల అన్నారు. ఈ మేరకు సునీల ఆధ్వర్యంలో మంగళవారం మండలకేంద్రమైన ముసునూరు గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

లోపూడిలో అన్నసమారాధన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని లోపూడి గ్రామంలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

CHANGE OF NAME

I, SANGANI VAGARAJU, S/O. SANGANI NARASIMHA SWAMY, D.NO. 3-43, NEAR TUFFAN CENTER, LB CHERLA POST, NARASAPURAM (M), W.G.DT. A.P. I HAVE CHANGED MY NAME FROM SANGANI GOKARAJU (OLD NAME) TO SANGANI VAGARAJU (NEW NAME) HENCE AFTER ALL MY DOCUMENTS AND CORRESPONDENCE WILL BE COUNTINUE WITH MY NEW NAME SANGANI VAGARAJU

In the Court of the Senior Civil Judge, Tadepalligudem

E.P. No. 6/2023 in **O.S. No. 244/2011**

Between:

Madicherla Krishnamurthy ...D.H.R

AND

1. Palakolanu Lakshmi
2. Palakolanu Siva Kumar
3. Palakolanu Venkata Lakshmi Prasanna
4. Ponnapalli Pushapavathi
5. Ponnapalli Murali Krishna
6. Ponnapalli Rajeev ...J.D.Rs

Please take notice that in the above matter for recovery of the Decree amount the Honourable Court ordered for sale of E,.P schedule Property in the open auction in the premises of the Senior Civil Judge Court, Tadepalligudem and fixed the date for auction of the E.P. schedule property on 30-06-2023. If, any one willing to participate in the open auction to be held on 30-06-2023 is to be attend before the Senior Civil Judge Court, Tadepalligudem **at 10.30 A.M on 30-06-2023** and participate in the auction after knowing the terms and conditions of the auction.

E.P SCHEDULE

West Godavari District, Nallajerla Mandal, Ananthapalli SRO, Prakasaraopalem Village and Gram Panchayath, Door No. 6-129/A, Current Service No. 623, Rice Mill in an extent of 872 square yards or Ac. 0-18 cents on the middle out of Ac. 0-50 cents on the East out of Ac. 1-55 cents in R.S. No. 225/5 and bounded as follows.

EAST: Road.
SOUTH: Land of Boyapati Gangaraju.
WEST: Land of Rajakas Society.
NORTH: Land of P.Viswanadham.

Within the above boundaries Rice Mill in an extent of Ac. 0-18 cents or 872 square yards of site *together with roof, doors, electrical fittings, rice mill machinery, rubber, Polaru separator, Konlu, elecates, 20 HP motor, Jallellu, 3 stoves etc., and all other machinery.*

D.H.R. Value: Rs. 10,00,000/-
Amin Value: Rs. 32,00,000/-

K.MANI KUMAR
Advocate for D.H.R
Ph: 08818-244620

Tadepalligudem
Date: 13-06-2023